క్లుప్తంగా

ప్రైవేట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి



డీఐఈవో ప్రభాకర్‌ను సత్కరిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం

నరసాపురం: ప్రైవేట్ పాఠశాలల యామాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏపీ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం జిల్లా అధ్యక్షుడు ఘంటశాల బ్రహ్మాజీ కోరారు. ఇటీవల డీఐఈవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్‌కు శుక్రవారం భీమవరంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం ఆధ్వర్యంలో సత్కారం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో చిన్న ప్రైవేట్ స్కూల్స్ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఏపీజేఎంఏ గౌరవ అధ్యక్షుడు ప్రగతి రాజా, కార్యదర్శి స్వామి, చిడే సత్యనారాయణ, అవినాష్, పిప్పర సుధీర్‌రాజు పాల్గొన్నారు.

శాకాంబరిగా పార్వతీదేవి

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం శ్రీక్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం పార్వతి, లక్ష్మీదేవి అమ్మవార్లను శాకాంబరి అమ్మవార్లుగా అలంకరించారు. పలు రకాల కాయగూరలు, ఆకుకూరలతో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాస్, అర్చకులు కిష్టప్ప, వీరబాబు, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరం

యలమంచిలి: విద్యాభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు దాతల సహకారం అవసరమని కాజ తూర్పు గ్రామంలోని పింగళి వెంకయ్య జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు షేక్ పీర్ సాహెబ్ అన్నారు. పాఠశాలలో చదువుతున్న 140 మంది విద్యార్థులకు శుక్రవారం పాలకొల్లు వాకర్స్ క్లబ్ తరపున క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు రూ.10 వేలు విలువైన రాత పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు జక్కం రాజు, పాలకొల్లు వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, పోతుల ఉమాశంకరరావు, జవ్వాజి కల్యాణ్, కర్రి కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

యలమంచిలి: రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు, కుల వృత్తులు, చేతి వృత్తులు, సంచార జాతులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు ఫీజు రీయింబర్స్ చేసి, మెస్ ఛార్జీలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని యాదవ్ మాట్లాడుతూ పై సంక్షేమ పథకాలు అందక విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో పాలకొల్లు నియోజకవర్గ అధ్యక్షులు పొన్నమండ ముత్యాలరావు, మండల మహిళ అధ్యక్షురాలు గుబ్బల దుర్గా రాజేశ్వరి, ఆలపాటి రవికుమార్, కర్రి ఏసు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల ప్రయోజనాలకే లేబర్ కోడ్లు

పాలకొల్లు సెంట్రల్: దేశంలో పెట్టుబడిదారుల ప్రయోజనాలకు మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను తెచ్చిందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్‌వద్ద ఆచంట నుంచి ప్రచార జాతా పాలకొల్లు గాంధీబొమ్మల సెంటర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్స్‌ను రద్దు చేసి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై ఈ నెల 9వ తేదిన దేశ వ్యాప్తంగా జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆంజనేయులు, ఎస్.వెంకటేశ్వరరావు, ఎం.సూరిబాబు, సీహెచ్ లక్ష్మి, డి.జ్యోతి, వై.రాణి, పిల్లి ప్రసాద్, జవ్వాది శ్రీనివాస్, దేవ సుధాకర్, చల్లా సోమేశ్వరరావు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సేవలు స్ఫూర్తిదాయకం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్వామి వివేకానంద వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జక్కంపూడి కుమార్, వెంకటేష్ వడయార్, చెరుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి

పెనుగొండ: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను పెనుగొండలో ఘనంగా నిర్వహించారు. ఆర్య వైశ్య ఫ్రెండ్స్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం గాంధీ బొమ్మల సెంటర్‌లో రోశయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.

రైతుల పాలిట శాపం నక్కల డ్రెయిన్

- ఏటా పంట పొలాలను ముంచుతున్న వైనం
- డంపింగ్ యార్డుగా మారిన డ్రెయిన్ గట్టు
- రైతుల గోడు పట్టించుకొనే నాథుడు కరువు



కొఠాలపర్రు వద్ద నక్కల డ్రెయిన్

పెనుగొండ: రైతుల పాలిట దుఃఖ దాయినిగా పేరుగాంచిన నక్కల డ్రెయిన్ వారి పాలిట శాపంగా మారింది. దీంతో వరి చేలకు పెనుప్రమాదం పొంచి ఉంది. ప్రతి ఏటా రైతులను నిండా ముంచి వేస్తున్నా నక్కల డ్రెయిన్ ప్రక్షాళనకు పాలకులు ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలంలో ప్రారంభమైన నక్కల డ్రెయిన్ పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ, ఆచంట, యలమంచిలి మండలాల్లో ప్రవహించి లక్ష్మీపాలెం వద్ద ముగుస్తుంది. సుమారు 40 వేల ఎకరాలకు చెందిన మురుగుతో ప్రవహిస్తుంది. ప్రతి ఏటా జులై, ఆగష్టు, సెప్టెంబర్‌లలో పరీవాహక ప్రాంత రైతులకు ముంపు తాకిడి తీవ్రంగా ఉండడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా పరీవాహక గ్రామాల్లో పంచాయతీలు నక్కల డ్రెయిన్ గట్టును డంపింగ్ యార్డులుగా వినియోగించుకొంటున్నారు. డంపింగ్ యార్డులు పర్వతాల్లా పెరిగిపోతూ నక్కల డ్రెయిన్‌లో మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి.



పెనుగొండలో బక్కచిక్కిన నక్కల డ్రెయిన్

దీంతో నక్కల డ్రెయిన్ బక్కచిక్కిపోతూ ప్రవాహానికి ఇబ్బందికరంగా మారింది. తద్వారా ప్రతి వర్షాకాలంలోనూ పరీవాహక వరి చేలు నీటి ముంపునకు గురవుతున్నాయి. రెండు దశాబ్దాలకు పైగా నక్కల డ్రెయిన్ ప్రక్షాళన లేకపోవడంతో మరీ ఇబ్బందికరంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కేవలం తూడు తొలగింపునకు మాత్రం కలుపు నివారణ మందు పిచికారీ చేసి చేతులు దులుపుకున్నారు.



గత ఏడాది నక్కల డ్రెయిన్ ఉధృతితో ఆచంట వేమవరంలో నీట మునిగిన వరి చేలు

డంపింగ్ యార్డుకు స్థల కేటాయింపునకు మీనమేషాలు

పెనుగొండ పంచాయతీ నక్కల డ్రెయిన్ గట్టును డంపింగ్ యార్డుకు వినియోగించుకుంటుంది. చెత్తాచెదారాలు వేయడానికి వీలు లేనంతగా గట్టు నిండిపోయింది. దీంతో డంపింగ్‌యార్డు స్థలం కేటాయించాలంటూ ప్రభుత్వానికి పంచాయతీ పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న నాధుడే కరువయ్యాడు. దీంతో చెత్తాచెదారాలు నక్కల డ్రెయిన్‌ను సగంవరకూ ఆక్రమించేస్తున్నాయి.

ఏటా ఆచంట వేమవరం వరి చేలు ముంపు

ప్రతి ఏటా ఆచంట వేమవరం పరిసర గ్రామాలకు చెందిన వరి చేలు నక్కల డ్రెయిన్ ఉధృతితో నీటి ముంపుకు గురవుతున్నాయి. గత ఏడాది మూడు పర్యాయాలు వరినాట్లు వేయాల్సిన పరిస్థితి రైతులకు ఏర్పడింది. దీంతో రూ.15 వేలు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి నక్కల డ్రెయిన్ ఇబ్బందులు తొలగించాలంటూ రైతులు కోరుతున్నారు.

నేడు అరుణాచలానికి ప్రత్యేక బస్సు

నరసాపురం: ఆషాడమాసం పురస్కరించుకుని నరసాపురం నుంచి శనివారం అరుణాచలంకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. శనివారం బయలుదేరి 10వ తేదీన గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా దైవదర్శనం చేసుకోవడానికి వీలుగా ఈ బస్సు ఏర్పాటు చేశామన్నారు. టికెట్టు ధర రూ.3,200గా నిర్ణయించినట్లు చెప్పారు. కాళహస్తి, కాణిపాకం, సిరిపురం మీదుగా వెళుతుందని, ప్రయాణికులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

వైఎస్సార్ సీపీ నేతకు భార్యావియోగం

నరసాపురం రూరల్: వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దొంగ మురళీకృష్ణ సతీమణి మణిదీపిక (45) ఆకస్మికంగా మృతి చెందారు. ఈమె గత వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మణిదీపిక ఆకస్మిక మృతికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, నాయకులు పీడీ రాజు, పెండ్ర వీరన్న, బొక్కా రాధాకృష్ణ, సోనీ, ఉంగరాల రమేష్ నాయుడు, కామన బుజ్జి, కడలి రాంబాబు, సురేంద్ర సంతాపం తెలిపారు.

అమ్మకానికి మున్సిపల్ వాటర్

స్థానికుల ఫిర్యాదుతో ట్యాంకర్ స్వాధీనం



ట్యాంకర్ స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ అంజయ్య

నరసాపురం: పట్టణంలోని 30వ వార్డులో మంచి నీటి వ్యాపారం సాగించే బండారు సుబ్బారావు ఏకంగా మున్సిపల్ వాటర్‌ను అమ్మకం చేస్తున్న నిర్వాకం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెలతో పట్టణంలో ఓ పక్క బిందెడు మంచినీళ్లు దొరక్క జనం ఇబ్బందులు పడుతుంటే సుబ్బారావు ఏకంగా మోటార్ ద్వారా కుళాయి నీటిని తన సొంత ట్యాంకర్‌లోకి ఎక్కించి, టిన్ను వాటర్ రూ.50 నుంచి 100 వరకు అమ్ముతున్నాడు. శుక్రవారం ఉదయం మత్స్యపురి రోడ్డు పక్కన బహిరంగంగా ట్యాంకర్‌లోకి ఎక్కిస్తుండగా స్థానికులు పట్టుకొని గొడవకు గిగారు. స్థానిక వార్డు కౌన్సిలర్ అడిదల శ్యామలకు ఫిర్యాదు చేశారు. మున్సిల్ అధికారులకు కూడా ఫిర్యాదు చేయడంతో కమిషనర్ ఎం.అంజయ్య వచ్చి ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే గతంలో ఇతను అదే విధంగా చేయడం, స్థానికులు గొడవ చేయడంతో మున్సిపల్ అధికారులు మోటార్లు సీజ్ చేశారు. కఠిన చర్యలు తీసుకోకపోవడంతో అప్పటి నుంచి మున్సిపల్ వాటర్ అమ్మకం వ్యాపారం షరా మామూలుగానే సాగుతున్నట్టుగా స్థానికులు చెబుతున్నారు. అయితే మున్సిపల్ వాటర్ సెక్షన్ అధికారులు, సిబ్బంది ప్రమేయంతోనే ఈ అక్రమ నీటి వ్యాపారం సాగుతుందనే విమర్శలు వెలువడుతున్నాయి.

భీమవరం సభకు తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



సమావేశానికి తరలి వెళుతున్న గుడాల గోపి, పార్టీ శ్రేణులు

పాలకొల్లు సెంట్రల్: భీమవరంలో శుక్రవారం జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమానికి పాలకొల్లు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడుతూ బాబు ష్యూరిటీ–భవిష్యత్ గ్యారంటీ అని ఎన్నికల్లోకి వచ్చి మోసం చేసిన చంద్రబాబు ప్రజలకు మాత్రం మోసం గ్యారంటీ చేశాడన్నారు. ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికల తరువాత మరో మాట చంద్రబాబు నైజమనడానికి ఇదే నిదర్శనమన్నారు. నేడు సుపరిపాలన పేరుతో గడప గడపకు తిరగాలంటే టీడీపీ నాయకుల్లో దడ పట్టుకుందన్నారు. ప్రజలు నిలదీస్తుంటే వారి యాత్ర ముందుకు సాగడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత, జోగాడ ఉమా మహేశ్వరరావు, పెచ్చెట్టి కృష్ణాజీ, జోగి వెంకటేశ్వరరావు, వీరా మల్లిఖార్జునుడు, శంకరాపు శ్రీను, సాలా నర్సయ్య, మామిడి శెట్టి చిట్టిబాబు, రాజేష్, మహిళలు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డిపోగేట్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

నరసాపురం: ఆర్టీసీ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి అల్లం నారాయణ అన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సమస్యల పరిష్కారం కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో డిపో గేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వద్ద పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ఫైల్‌పై వెంటనే సంతకం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏ బకాయిలు, పీఆర్‌సీ బకాయిలు వెంటనే ఉద్యోగులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల గ్రాడ్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్మెంట్‌ను ప్రభుత్వమే చెల్లించాలన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సిబ్బంది మాత్రమే నడిపేలా చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ వారి జోక్యం లేకుండా చూడాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈయూ నరసాపురం డిపో కార్యదర్శి పి.సీతారామయ్య, అప్పాజీ, ఏఐటీయూసీ నాయకులు నెక్కంటి క్రాంతికుమార్, ఆరేటి మృత్యుంజయ పాల్గొన్నారు.

ఏకో పాఠశాలల ద్వారా ఉచిత విద్య



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్ రెడ్డి

పాలకొల్లు సెంట్రల్: విద్యా భారతి ద్వారా 125 గ్రామాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలల ద్వారా ఫ్రీ ఎడ్యుకేషన్ అందిస్తున్నామని దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి లింగం సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో హనుమాన్ కాలనీలో ఉన్న సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో సరస్వతీ విద్యాపీఠం గోదావరి విభాగ్ ప్రబంధకారిణీ సభ్యుల అవగాహనా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విజయవాడ సమితిలో విద్యా భారతిలో మూడు విభాగాల్లో పాఠశాలలు పని చేస్తాయన్నారు. సరస్వతి శిశు మందిర్, విజ్ఞాన విహార్, విజ్ఞాన భారతి పేరుతో 190 పాఠశాలలు ఉన్నాయన్నారు. వీటిలో లా, డిగ్రీ కళాశాలలు ఉన్నాయన్నారు. అంతే కాకుండా గిరిజన ప్రాంతాలైన పాడేరు ప్రాంతంలో 125 గ్రామాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలల ద్వారా ఉచిత విద్యను అందజేస్తున్నామన్నారు. గిరిజన విద్యార్థులకు హాస్టల్ వసతి కూడా కల్పిస్తున్నామన్నారు. 50 నగర ప్రాంతాల్లో సంస్కార కేంద్రాలు ఉన్నాయన్నారు.తమ పాఠశాలల్లో ముఖ్యంగా విలువలు, దేశభక్తి గురించి వివరిస్తామన్నారు. సరస్వతి విద్యాపీఠం సంఘటన మంత్రి, విజయవాడ కన్నా భాస్కర్, విజయవాడ కార్యదర్శి కొసనా జగదీష్, విభాగ అధ్యక్షుడు కేవీఎల్ నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ చెప్పారు. మున్సిపల్ మార్కెట్ పాట ఖరారుకు సంబంధించి ఏకైక అజెండాతో సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సభ్యులు విధిగా హాజరు కావాలని చెప్పారు. వార్డుల్లో ప్రధాన సమస్యలపై చర్చ జరుగుతుందన్నారు.

అల్లూరి స్ఫూర్తితో క్షత్రియుల సేవలు మరువలేనివి



పాలకొల్లు సెంట్రల్: అల్లూరి జయంతి వేడుకల్లో పాల్గొన్న జనం

పాలకొల్లు సెంట్రల్: స్వాతంత్రోద్యమం కోసం ఎన్నో త్యాగులు చేసి అతి చిన్న వయస్సులోనే దేశం కోసం బ్రిటిష్ వారిని ఎదిరించి నిలబడి ప్రాణాలర్పించిన గొప్ప విప్లవకారుడు అల్లూరి సీతారామరాజని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ దేశం కోసం నాడు అల్లూరి సీతారామరాజు పోరాటం చేశారని నేడు సమాజం అభివృద్ధి కోసం క్షత్రియులు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తితో క్షత్రియుల సేవలు ఎనలేనివన్నారు. అనంతరం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు, సెక్రటరీ వివి సోమరాజు, కెఎస్‌పిఎన్ వర్మ, కెవి కృష్ణవర్మ, వేగేశ్న రంగరాజు,కనుమూరి రామకృష్ణంరాజు, అంగర రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి పోరాటం చిరస్మరణీయం

యలమంచిలి: మన్యం ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్ష రగిల్చి వారితో కలిసి బ్రిటీష్ ప్రభుత్వంపై అలుపెరుగని పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని వైఎస్సార్‌వైఎస్సార్ సీపీ నేరేడుమిల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స జల దుర్గా ప్రసాదరాజు (బుజ్జిరాజు) అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా నేరేడుమిల్లి గ్రామంలో శుక్రవారం బుజ్జిరాజు ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి గ్రామస్తులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శిరిగినీడి పెద్దిరాజు, జల్లి నాగేశ్వరరావు, పెచ్చటి వెంకటేశ్వర్లు, సాగి సూర్యనారాయణరాజు పంచాయతీ కార్యదర్శి తోటకూర పవన్ కుమార్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

100 పశువులకు ఉచిత వ్యాక్సిన్లు



పశువులకు వ్యాక్సిన్లు వేస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులు

యలమంచిలి: యలమంచిలి లంక గ్రామంలో సుమారు 100 పశువులకు పశు సంవర్ధక శాఖ అధికారులు శుక్రవారం థైలేరియోసిస్ వ్యాధి రాకుండా టీకాలు వేశారు. మూడు నెలల వయస్సు దాటిన ఆవులు, గేదెలకు (చూడి పశువులు మినహాయించి) టీకాలు ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ థైలేరియా వ్యాధి సోకిన పశువులకు అధిక జ్వరం, లింఫ్ గ్రంథులు వాయడం, నీరసించడం, రక్తహీనత, శ్వాసకోశ సంబంధిత సమస్యలు వస్తాయన్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే పశువు మరణించే అవకాశం ఉందన్నారు. కనుక ముందు జాగ్రత్తగా ఉచిత టీకాలు వేస్తున్నట్లు ఆయన వివరించారు. మేడపాడు గ్రామంలో శనివారం ఈ టీకాలు వేస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, పాలకొల్లు డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ జి.సత్యనారాయణ, సిబ్బంది జగన్నాథరావు, దొరబాబు, తరుణ్, సురేష్, వలవల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మనుషుల అక్రమ రవాణా నిరోధం అందరి బాధ్యత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

నరసాపురం రూరల్: మనుషుల అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత అని సీడీపీవో ఊర్మిళ అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ మనుషుల అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం మొగల్తూరు సీడీపీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఊర్మిళ మాట్లాడుతూ ఈ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరంగా ఉందన్నారు. ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీనికి గురవుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని ముఖ్యంగా ఉద్యోగం, సినిమా అవకాశాలను ఎరగా చూపి మోసం చేసి విదేశాలకు అమ్ముతున్నారని అన్నారు. ప్రజ్వల కోఆర్డినేటర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈ అక్రమ రవాణాకు, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ గత 28 సంవత్సరాలుగా పద్మ శ్రీ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీస్, విద్యా శాఖ, న్యాయ శాఖల సమన్వయముతో ఇప్పటి వరకు వేలాది మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి వారికీ పునరావాసం కల్పించామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్‌లు శ్రీదేవి, విజయకుమారి, ప్రజ్వల అసిస్టెంట్ కో–ఆర్డినేటర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

రేపు కుక్కలకు ఉచిత టీకాలు

నరసాపురం రూరల్: జునోసిస్ డేను పురస్కరించుకొని ఈ నెల 6వ తేదీ ఆదివారం నరసాపురం పట్టణంలోని ఏరియా పశు వైద్యశాలలో ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశు వైద్యుడు సురేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా కుక్కలకు ఉదయం 9 గంటలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేస్తామన్నారు. పెంపుడు కుక్కలకు విధిగా సంవత్సరానికి ఒక సారి టీకాలు వేయించాలన్నారు. జంతువుల ద్వారా మానవాళికి సంక్రమించే వ్యాధులను జూనోసిస్ అంటారని ఆయన వివరించారు. అదే విధంగా ఆదివారం సాయంత్రం 4.30 నుంచి 9.30 గంటల వరకు హ్యాపీ పెట్ క్లినిక్ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రాబిస్ వ్యాక్సిన్లను వేస్తామని నిర్వాహకులు తెలిపారు.

వంగవీటి రంగాకు ఘన నివాళి



రంగా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న గుడాల గోపి, గుణ్ణం నాగబాబు తదితరులు



పెనుగొండ: రంగాకు నివాళులర్పిస్తున్న కాపు యువత

పాలకొల్లు సెంట్రల్: బడుగు, బలహీన వర్గాల ఆశా జ్యోతి వంగవీటి మోహనరంగా అని పలువురు నాయకులు ఆయన సేవలను కొనియాడారు. శుక్రవారం పట్టణంలో మారుతీ సెంటర్ వద్ద మోహనరంగా జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రంగా నిత్యం పేద ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా పనిచేసిన నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు, నాయకులు గుణ్ణం నాగబాబు, నడపన గోవిందరాజుల నాయుడు, కోరాడ శ్రీనివాసు, మద్దా చంద్రకళ, వీరా మల్లిఖార్జునరావు, వీరా శ్రీను, వంగా నరసింహరావు, యర్రంశెట్టి వెంకటరత్నం, అంగర రామ్మోహన్, కోడి విజయభాస్కర్, పెచ్చెట్టి బాబు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: వంగవీటి మోహన్‌రంగా జయంతి వేడుకలు పెనుగొండలో నిర్వహించారు. శుక్రవారం పంచాయతీ పార్కు వద్ద, సిద్ధాంతం, రామన్నపాలెంలోని రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాపు యువత ఆధ్వర్యంలో మండలంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

రంగా అందరి వాడు

నరసాపురం రూరల్: సమాజంలోని అందరి అభ్యున్నతి కోసం పాటుపడిన వ్యక్తి వంగవీటి మోహనరంగా అని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. శుక్రవారం మొగల్తూరు మండలం కాళీపట్నం తూర్పు, నరసాపురం మండలంలోని చిట్టవరం గ్రామాల్లో రంగా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ, నాయకులు జక్కం బాబ్జి, మేకల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసాపురం డివిజన్
90102 23729 (పాలకొల్లు)
81869 95956 (నరసాపురం)
90102 23729 (ఆచంట)
Office mail : tpgadvt@gmail.com